క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

నిజామాబాద్ సిటీ: బీడీ కార్మికుల ఉపాధి, హక్కుల రక్షణకు జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు చింత భూమేశ్వర్ కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులు చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను, చట్టబద్ధ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. హక్కుల సాధనకు కార్మికులు పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భూమన్న, సూర్యశివాజీ, హరిత, ఆకుల రాములు, గంగాధర్, శివకుమార్, సుప్రియ, వెంకట్ నారాయణ, తిరుమలేశ్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సన్మానం



లైన్‌మన్‌ను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

ఇందల్వాయి: ఎల్లారెడ్డిపల్లెలో ఎలక్ట్రికల్ లైన్‌మన్‌గా విధులు నిర్వహించి వేరేచోటికి బదిలీ అయిన అంజన్నను వీడీసీ సభ్యులు ఆదివారం పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. మూడేళ్లపాటు అందరికి అందుబాటులో ఉంటూ సకాలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించిన అంజన్న బదిలీ కావడం బాధగా ఉందని వీడీసీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆరోగ్య రక్ష, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆరోగ్య రక్ష కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆరోగ్యరక్ష నిర్వాహకురాలు డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక, శారీరక సమస్యలను పూర్తిగా అధిగమించవచ్చన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇందూరు యువత అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సూజాత రెడ్డి, మద్ది గంగాధర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



నిజామాబాద్‌నాగారం: అసోసియేషన్ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నిజామాబాద్ తరఫున రూ. పదివేల ఆర్థికసాయాన్ని అందిస్తామని అధ్యక్షుడు ఎన్ నాగేందర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ భవిష్యత్తు ప్రణాళిక గురించి చర్చించినట్లు తెలిపారు. అలాగే పెన్షనర్ల సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ ఉపాధ్యక్షుడు ముత్తారం నర్సింహ స్వామి, అసోసియేషన్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి



మోపాల్: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా ఉపాధ్యక్షుడు రొద్ద ప్రవీణ్ అన్నారు. ఆదివారం సంస్థాగత నిర్మాణంలో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలు లేని గ్రామాల్లో గద్దెలు నిర్మించి, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పుడాల స్వామి, బి నర్సయ్య, రవి, సాయిలు, పెద్దోళ్ల యమునా, గంగారాం, సంజీవ్, శేఖర్, వెంకటేశ్, సురేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

- ఆర్థిక సహాయాల ఘనత వైఎస్సార్‌దే..
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

నిజామాబాద్‌అర్బన్: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనమండలి సభ్యులు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి 572 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని, దీనిని మరింత పెంచాలన్నారు.

అనంతరం షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలన కారణంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. రూ. 7.50 లక్షల కోట్ల అప్పులపై తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 6500 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సహాయాల అందజేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఘనతేనన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో నాడు ఈ విధానం ఉండేదని దీనిని రాష్ట్రంలోని పేద ప్రజలకు అందించేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడే ఆలోచించినట్లు అన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ ఉన్నారు.

గుండారం గుట్టలను తోడేస్తున్నారు



గుండారం గుట్ట

- అక్రమంగా మొరం తరలిస్తున్న దుండగులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని గుండారం గ్రామంలో ఉన్న గుట్టలను దుండగులు తోడేస్తున్నారు. అక్రమంగా మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు రాత్రి పూట తవ్వకాలు చేపట్టి మొరం గుట్టను మాయం చేస్తున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

మండలంలోని గుండారం శివారులోని గుట్టలు ఎక్కువగా ఉన్నాయి. వాటి నుంచి దాదాపు పదేళ్ల నుంచి అక్రమార్కులు మొరం తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారుల కనుసైగల్లో నడుస్తుండడతో పట్టించుకునే వారు కరువయ్యారు. రెండు నెలల క్రితం సారంగపూర్ వాసికి ప్రభుత్వ కార్యకాలపాల కోసం మొరం తరలించేందుకు తహసీల్దార్ అనుమతులు ఇచ్చారు. అప్పటి వరకు నిమ్మకుండిన అక్రమార్కులు సారంగపూర్ వాసి అనుమతి పూర్తిగా కాగానే మళ్లీ మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు ఈ విషయమై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాహనాలు సీజ్ చేస్తాం

ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. అధికారుల అనుమతి లేకుండా గుండారం గుట్ట నుంచి మొరం తవ్వకాలు చేపట్టకూడదు. అవసరమైతే పోలీసుల సహాయంతో పెట్రోలింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. అటవీ సంపదను అక్రమంగా కొల్లగొడితే చర్యలు తప్పవు. – అనురుద్, తహసీల్దార్, రూరల్

చిక్కుముడులు వీడేనా..?

- భూభారతికి వినతుల వెల్లువ
- మూడు వేలకు పైగా దరఖాస్తులు
- త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు



మెంట్రాజ్‌పల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

డిచ్‌పల్లి: భూభారతి చట్టం అమలులో భాగంగా డిచ్‌పల్లి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మూడు వేలకు పైగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనెల 3 నుంచి 13 వరకు సదస్సులు కొనసాగాయి. గతంలో ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెలాఖరు నుంచి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించనున్నారు. దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతుతో పాటు సమీపంలోని రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఇరువురి వద్ద నున్న డాక్యుమెంట్లతో పాటు ఆధారాలను సమర్పించేందుకు ఏడురోజుల సమయం ఇస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులతో పోలుస్తారు. అనంతరం సదరు దరఖాస్తు వాస్తవికతను తేల్చనున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యూటేషన్లు, కోర్టు, ఆర్డర్లు, డీఎస్ పెండింగ్, విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందాయి. రెవెన్యూ గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తులను కేటగిరీలుగా విభజించి కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సాదా బైనామా అంశం కోర్టు పరిధిలో ఉండడంతో వాటిని మినహాయించి మిగిలిన వాటిని పరిశీలిస్తున్నారు. రెవెన్యూ గ్రామాలవారీగా నోటీసులు జారీ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఆర్డీవోకు సిఫార్సు చేయనున్నారు.

కోర్టు చిక్కుముళ్లు వీడితే..

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. డిచ్‌పల్లి మండలంలో వచ్చిన సాదాబైనామాల క్రమబద్ధీకరణకు భూభారతి చట్టంలో ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. తెల్ల కాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ జరుగుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. కోర్టు చిక్కుముళ్లు వీడితే సాదాబైనామాల దరఖాస్తుల సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కానుంది.

పరిశీలించి పరిష్కరిస్తాం

రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి, ఏ విభాగంలోకి వస్తుందో నిర్ణయించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. డిచ్‌పల్లి మండలంలో రైతుల నుంచి మూడు వేలకు పైగా దరఖాస్తులను స్వీకరించాం. ప్రస్తుతం ఆన్‌లైన్ లో నమోదు చేయిస్తున్నాం. అనంతరం పరిష్కారానికి చర్యలు చేపడుతాం. – సతీశ్‌రెడ్డి, తహసీల్దార్, డిచ్‌పల్లి

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డుకు అతి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. కామారెడ్డి–భీంగల్ ప్రధాన రహదారి నుంచి ఒంటిప్ప తండా సమీపంలో తూంపల్లి గ్రామానికి గల బైపాస్ రోడ్డును తారు రోడ్డుగా మార్చారు. రోడ్డును విస్తరించడంతో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకొని ఉంది. రోడ్డుకు అతి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను గమనించనట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం నెలకొంది. తూంపల్లి, పాకాల, వర్షన్ తండా, గోప్యనాయక్ తండా జీపీలతో పాటు మరో ఆరు తండాల ప్రజలు ఈ మార్గం గుండానే నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన సఫియా బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబానికి చెందిన బాధితురాలు చికిత్స కోసం ఆస్పత్రి ఖర్చులు భరించడం కష్టంగా మారింది. దీంతో కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితురాలికి ఆస్పత్రిలో చికిత్స నిరాటంకంగా కొనసాగించేందుకు ఎల్‌వోసీ పత్రం అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, డీసీసీ డెలిగేట్ వాసుబాబు, ధర్మాగౌడ్, బాబా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


అర్గుల్‌లో తాత ఆయి పండుగ



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో ఆదివారం తాత ఆయి పండుగను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు. దీంతో గ్రామంలో వన భోజనాల సందడి నెలకొంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోర్త రాజేందర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు.. వంతెనలు మరిచారు

ప్రయాణికుల ఇబ్బందులు



గన్నారం చిన్నవాగుపై ఉన్న లో లెవెల్ వంతెన



సిర్నాపల్లి వాగుపై ఉన్న లో లెవెల్ వంతెన

ఇందల్వాయి: వంతెనల నిర్మాణం లేక మండల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి గన్నారం మీదుగా సిర్నాపల్లి వరకు మూడేళ్ల క్రితం రూ. 10.50 కోట్లతో 8 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు వేశారు. కానీ, గన్నారం చిన్నవాగు, సిర్నాపల్లి వాగులపై హైలెవెల్ వంతెనలను నిర్మించకుండా వదిలేశారు. దీంతో అధికంగా వర్షాలు కురిసినప్పుడు వాగులు పొంగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు వెంట గన్నారం, నల్లవెల్లి, సిర్నాపల్లి, స్టేషన్ తండా, మెగ్యానాయక్ తండాతోపాటు గౌరారం, డొంకల్ తదితర గ్రామాల ప్రయాణికులు నిత్యం వేల సంఖ్యలో ప్రయాణిస్తారు. గతంలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గన్నారం చిన్నవాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనలను నిర్మించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



గన్నారం చిన్న వాగు పొంగినప్పుడు రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఎన్నోమార్లు వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చాం. ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. – కుంట మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్,గన్నారం

వేరే మార్గమే లేదు



సిర్నాపల్లి వాగు పొంగితే గ్రామం దాటడానికి వేరే మార్గం లేదు. అత్యవసర ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. వానాకాలంలో మూడు, నాలుగుసార్లు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సిర్నాపల్లి వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలి. – కొత్తూరి సురేశ్, సిర్నాపల్లి

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,500	వెండి(కిలో)	1,11,000
22 క్యారెట్స్	90,927	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	100	150	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	60	గోబిపువ్వు	40	60
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	60	100	కరివేపాకు	40	60
కొత్తిమీర	30	50	చామగడ్డ	30	50
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	70

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 కుబేర(తెలుగు)-1.30, 7.30
స్క్రీన్-2 కుబేర(తెలుగు)-10.45,
8 వసంతాలు(తెలుగు)-4.30, 10.40
స్క్రీన్-3 కుబేర(తెలుగు)-4.20, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 ఎలియో(3డీ తెలుగు)-10.15
ఎలియో(3డీ ఇంగ్లీష్)-4.20
కుబేర(తెలుగు)-12.40, 6.45, 10.25
స్క్రీన్-2 హౌ టు ట్రేన్ యువర్ డ్రాగన్ (3డీ తెలుగు)-10.05 గు)-10.05
8 వసంతాలు(తెలుగు)-12.50
కుబేర(తెలుగు)-3.45
సితారే జమీన్ పర్(హిందీ)-7.25, 10.50
స్క్రీన్-3 కుబేర(తెలుగు)-10.00
సితారే జమీన్ పర్(హిందీ)-1.40
బాలేరినా(తెలుగు)-5.05
28 ఇయర్స్ లెటర్(ఇంగ్లీష్)-7.50
సితారే జమీన్ పర్(తెలుగు)-10.30
స్క్రీన్ -4 సితారే జమీన్ పర్ -10.05, 4.10
28 ఇయర్స్ లెటర్(ఇంగ్లీష్)-1.30
8 వసంతాలు(తెలుగు)-7.35, 10.30

విజయ్ కుబేర దేవి సితారే జమీన్ పర్
నటరాజ్ సితారే జమీన్ పర్ (హిందీ)
లలితామహల్ 8 వసంతాలు

బ్రాహ్మణ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ రూరల్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శశికాంత్ కులకర్ణి, గౌరవ అధ్యక్షుడిగా భూపతిరావు, ఉపాధ్యక్షుడిగా విజయ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్ బాబు కులకర్ణి, ఉపకార్యదర్శిగా న్యాలం రమేశ్‌రావు, కోశాధికారిగా మిలింద్ కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గిరిధర్‌రావు తెలిపారు.

రఘునాథ ఆలయంలో ఆత్మీయ సమ్మేళనం



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో ఆదివారం ఐటీఐ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వట్టల్వార్ ప్రమోద్ మాట్లాడుతూ.. అసోసియేషన్ ద్వారా ఎన్నో ధార్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రఘునాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అసోసియేషన్ కోశాధికారి ప్రమోద్ హర్గే, మనోహర శాస్త్రి, న్యాలం శ్రీనివాస్, ప్రసాద్ జోషి, సంతోష్ నిర్మల్ కర్, దీపక్, న్యాలం రమేశ్ రావు, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డి మంత్రి అవుతారు

- పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



బోధన్‌టౌన్: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి భవిష్యత్తులో మంత్రి పదవి వస్తుందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి బోధన్ లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. ఇరిగేషన్ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బోధన్ లోని మధుమలాంచ కళాశాలలో విద్యాభ్యాసం చేశానని, ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల, రైతుల సంక్షేమం కృషి చేస్తుందని పేర్కొన్నారు.